సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 6 । జూలై । 2025



భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు అయినప్పటికీ ఆషాఢ మాసం కావడంతో రద్దీ తగ్గింది.



జంతువుల వ్యాధులతో జాగ్రత్త!

జంతువుల నుంచి సక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. నేడు జూనోసిస్ డే సందర్భంగా కుక్కలకు టీకాలు వేయనున్నారు. 8లో ▸



గురుకుల విద్య.. భద్రత మిథ్య

శిథిలావస్థకు చేరిన భవనాల్లోనే గురుకుల విద్య తరగతులు నిర్వహిస్తుండడంతో ఏ క్షణాన ఏ భవనం కూలిపోతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 8లో ▸

సాయంపై స్పష్టత కరువు

- జిల్లాలో మొదలైన తొలకరి పనులు
- నారుమడి నుంచి నాట్ల వరకు ఎకరాకు రూ.12,000 వరకు పెట్టుబడి
- అన్నదాత సుఖీభవ సాయం విడుదలపై సర్కారు మౌనం
- రైతులకు ఈకేవైసీతో సరి
- తొలి ఏడాది రూ.20,000 చొప్పున సాయానికి ఎగనామం
- పంట పెట్టుబడుల కోసం రైతుల అవస్థలు



పెంటపాడు మండలంలో నారుమడి

సాక్షి, భీమవరం: తొలకరి పనులు మొదలయ్యాయి. నారుమడి తయారీ నుంచి పంట చేతికందే వరకు ప్రతీది ఖర్చుతో కూడుకున్న పని. నారు నుంచి నాట్లు వేయడానికే ఎకరాకు రూ. 12 వేలు వరకు వెచ్చించాల్సిన పరిస్థితి. గత ఏడాది అన్నదాత సుఖీభవ సాయానికి ఎసరు పెట్టిన చంద్రబాబు సర్కారు ఈ సీజన్‌లో సాయం విడుదలపై ఇంకా స్పష్టత ఇవ్వకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలో 2.08 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగనుంది. 10,142 ఎకరాల్లో నారుమడులు సిద్ధం చేశారు. ముందుగా మాసూళ్లు జరిగిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, తణుకు ప్రాంతంలో 10,212 ఎకరాల్లో నాట్లు వేశారు. పాలకొల్లు, ఉండి, కాళ్ల, ఆకివీడు, యలమంచిలి, నరసాపురం మండలాల్లో నారుమడులు సిద్ధం చేస్తున్నారు. నవంబరు చివరిలో వచ్చే తుఫాన్ల బారిన పడకుండా ఈపాటికే పనులు ముమ్మరం చేసి జూలై మూడో వారం నాటికి నాట్లు పూర్తిచేయాల్సి ఉంది. ప్రస్తుత జాప్యం నేపథ్యంలో ఆగస్టు నెల వరకూ నాట్లు పడే అవకాశం ఉంది.

పెట్టుబడుల కోసం ఇక్కట్లు : సార్వాలో నారుమడులు సిద్ధం చేసిన నాటి నుంచి నాట్లు వేసే వరకు నెల రోజుల వ్యవధిలో నారుమడికి విత్తనాలు, పంట దమ్ము, పార లంకలు, నేలను చదునుచేసేందుకు, ఎరువులు, నాట్లు వేసేందుకు కూలీ ఖర్చులు తదితర రూపాల్లో రూ.12,000 వరకు ఖర్చవుతుంది. రబీ సీజన్‌కు ధాన్యం బకాయిలు దాదాపు రూ.150 కోట్లు విడుదల చేయకపోగా, గత నాలుగేళ్లుగా లేని నీటి తీరువాను వడ్డీతో సహా ఇప్పుడే చెల్లించాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది. మరోపక్క జూన్ 1నే కాలువలకు నీరు విడుదల చేసినా నెలాఖరు వరకు శివార్ల వరకు నీరు చేరలేదు. ఆయా కారణాలతో పెట్టుబడులకు చేతిలో సొమ్ముల్లేక సాగు ఆలస్యమవుతోంది.

గతంలో సాగుకు ముందే సాయం

గతంలో పెట్టుబడులు కోసం ఇబ్బంది పడాల్సిన పనిలేకుండా సాగు ప్రారంభానికి ముందే వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం రైతులకు సాయం అందించేది. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ.6000, రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 జతచేసి ఏటా రూ.13,500 మొత్తాన్ని ఖరీఫ్ ప్రారంభానికి ముందు, కోతలు, రబీ ఆరంభంలో మూడు విడతలుగా అందించేవారు. తొలివిడతగా మే నెలలో రూ.7,500 రైతుల ఖాతాలకు జమచేసేవారు. పంట పెట్టుబడుల కోసం సన్న, చిన్నకారు రైతులకు ఈ సాయం ఎంతో ఉపయోగపడేది. గత ప్రభుత్వంలోని ఐదేళ్లలో జిల్లాలోని 1,17,999 మంది రైతులకు రూ.796.49 కోట్ల లబ్ధి చేకూరింది.

ఈకేవైసీతో సరి : తాము అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేల చొప్పున రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద సాయం చేస్తామని చెప్పిన కూటమి మొదటి ఏడాది సాయానికి ఎగనామం పెట్టింది. ప్రస్తుత సీజన్‌కు సాయం ఎప్పుడు విడుదల చేసేది ఇంకా స్పష్టత లేదు. సాయం విడుదల చేసే పేరిట జిల్లాలోని రైతులకు ఈకేవైసీ నిర్వహిస్తోంది. ఇంతవరకు 1,05,597 మందికి ఈకేవైసీ పూర్తి కాగా 355 మందికి చేయాల్సి ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సాయం ఎప్పుడు విడుదల చేసేది స్పష్టత లేదంటున్నారు. తొలకరి పనులు ముమ్మరం కానున్న తరుణంలో పెట్టుబడులు పెట్టేందుకు చేతిలో సొమ్ములు లేక రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

సకాలంలో సొమ్ములివ్వలేదు



పది ఎకరాల వరకు సాగు చేస్తున్నాను. దాళ్వా ధాన్యం డబ్బులు నెలన్నర రోజులకు పైనే అందక ఎరువుల దుకాణాలు, ఫైనాన్స్ వ్యాపారులకు వడ్డీలతో అప్పులు చెల్లించాల్సి వచ్చింది. ఇప్పుడే నీటితీరువా చెల్లించాల్సిన దుస్థితి. తొలకరి పెట్టుబడులకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. అన్నదాత సుఖీభవ సాయం అందించి ఆదుకోవాలి.

– జంగా వెంకటరెడ్డి, రైతు, పెనుమంట్ర

ఎప్పుడు ఇచ్చేది ప్రకటించాలి



ప్రభుత్వం గత ఏడాది అన్నదాత సుఖీభవ సాయం విడుదల చేయక ఒక్కో రైతు రూ. 20 వేలు చొప్పున నష్టపోయాం. ఇప్పటికే తొలకరి పనులు మొదలయ్యాయి. ఈ సీజన్‌కు ను ఎప్పుడు విడుదల చేసేది ఇంకా చెప్పకపోవడం వల్ల రైతులు ఆందోళనకు గురికావాల్సి వస్తోంది. గత ప్రభుత్వంలో పనులు మొదలుకాకముందే సాయం విడుదల చేసేవారు.

– దేవరశెట్టి రాంబాబు, బి.కొండేపూడి, పెంటపాడు మండలం

తొలకరిలో సాగు పెట్టుబడులు (సుమారుగా)

- విత్తనం ప్యాకెట్ రూ. 600
- నారుమడి నిమిత్తం ఐదు సెంట్లలో దమ్ము, విత్తనాలు చల్లేందుకు, ఎరువుకు రూ.1,000
- నాట్ల నిమిత్తం పొలాన్ని రెండు సార్లు దమ్ము చేసేందుకు రూ.3,000
- పట్టి తోలేందుకు రూ.500
- గట్లు చెక్కేందుకు ఇద్దరు కూలీలు రూ.1,400
- నాట్లు వేసేందుకు కూలీలకు రూ.4,000
- బస్తాన్నర యూరియా, డీఏపీ, 40 కేజీల పొటాష్‌కు రూ.2300, చల్లేందుకు కూలీ ఖర్చులు రూ.2100
- కలుపు మందులు రూ.500, పురుగు మందులు రూ.2500, కూలీ ఖర్చులు రూ.2,100
- పంట కోతకు రూ. 5,200
- రవాణా, ఆరబెట్టేందుకు రూ.2,000, కూలీలు రూ.2,100

తగ్గని పుస్తకాల మోత

- ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోని ప్రైవేటు స్కూళ్లు
- బ్యాగ్‌లు మోయలేక చిన్నారుల అవస్థలు



భీమవరం: విద్యార్థులకు పుస్తకాల బరువు తక్కువగా ఉండేలా ప్రభుత్వం నిబంధనలు పెట్టినా ప్రైవేటు విద్యా సంస్థలు వాటిని పట్టించుకోవడం లేదు. ర్యాంకులు, ఫస్ట్‌క్లాస్‌లంటూ విద్యార్థులపై ఒత్తిడి పెంచి ఉదయం ఆరు గంటలకే తరగతులు ప్రారంభించి రాత్రి వరకు పుస్తకాలను బట్టీ పట్టిస్తున్నారు. పుస్తకాల బరువుతో అనేక సమస్యలకు గురవుతున్నారంటూ అధ్యయనంలో తేలినా.. విద్యార్థులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. ఏ క్లాస్‌కు ఎన్ని పుస్తకాలు ఇవ్వాలో ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. అయితే ప్రైవేటు విద్యాసంస్థలో విద్యార్థులకు మాత్రం బ్యాగ్‌ల బరువు తగ్గడం లేదు.

విద్యా సామగ్రి విక్రయిస్తున్న ప్రైవేటు స్కూళ్లు

విద్యా శాఖ లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 20 మండలాల పరిధిలో చిన్నా, పెద్ద ప్రైవేటు విద్యా సంస్థలు 435 వరకూ ఉన్నాయి. వీటిలో 96 ప్రైమరీ, 190 అప్పర్ ప్రైమరీ, 209 హైస్కూళ్లు ఉన్నాయి. తల్లికి వందనం పథకం ప్రైవేటు స్కూల్ విద్యార్థులకు కూడా వర్తింపచేయడంతో ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివించడానికి మక్కువ చూపుతున్నారు. దీంతో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేయడమేగాక విద్యాసామగ్రి కూడా స్కూళ్ల వద్దనే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విద్యా సంస్థలు విద్యా సామగ్రి అమ్మకూడదనే నిబంధనలు గాలికి వదిలి విచ్చల విడిగా పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్‌లు వంటివి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. విద్యాసామగ్రి విక్రయాలపై విద్యాశాఖ మొక్కుబడి దాడులు చేయడం మినహా కఠిన చర్యలు తీసుకున్న సంఘటనలు లేవు.

నిబంధనల ప్రకారం పుస్తకాలు ఇలా..

ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు రెండు పుస్తకాలు, 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు నాలుగు, 6, 7తరగతులకు 8 పుస్తకాలు, 8వ తరగతికి 10, 9వ తరగతికి 12, టెన్త్ క్లాస్ విద్యార్థులకు 14 పుస్తకాలు మాత్రమే వినియోగించాల్సివుంది. దీంతో బ్యాగ్ బరువు తగ్గి విద్యార్థులకు ఊరట కలుగుతుంది. ప్రైవేటు విద్యా సంస్థలు మాత్రం నిబంధనలు లేకుండా ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు 8 పుస్తకాల వరకు కొనుగోలు చేయిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కేవలం 6.5 లక్షల పాఠ్యపుస్తకాలు మాత్రమే పంపిణీ చేస్తే ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు దాదాపు 15 లక్షల పుస్తకాలకు పైగా వినియోగిస్తున్నారని అంచనా. పుస్తకాల బరువుతో ఆరోగ్య సమస్యలే గాకుండా మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు పాటించాలి



నిబంధనల ప్రకారం పుస్తకాలు బరువు తగ్గించాల్సిందే. దానిలో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు తక్కువ సంఖ్యలోనే నోట్ పుస్తకాలు పంపిణీ జరుగుతుంది. ప్రైవేట్ స్కూల్స్ కూడా అదే విధంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేసుకునేలా తల్లిదండ్రులకు సూచించాలి. ప్రైవేట్ స్కూళ్ల వద్ద విద్యా సామగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు.

– ఈ.నారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

స్కాంలకు సహకారం

- రైతుకు తెలియకుండానే రైతుల పేరుతో రుణాలు
- పలు సహకార సొసైటీల్లో అవినీతి
- విచారణాధికారులే కింగ్ మేకర్లుగా మారుతున్న వైనం
- చింతలపూడి సొసైటీలో గతంలో రూ.30 కోట్ల మేర అవినీతి
- డిపాజిట్లు ఇవ్వాలంటూ టి.నర్సాపురం సొసైటీ వద్ద రైతుల ఆందోళన



టి.నరసాపురం సహకార సంఘ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రైతులకు తెలియకుండా రైతుల పేరుతో కోట్లలో రుణాలు తీసుకుంటారు. రైతుల నుంచి డిపాజిట్లు సేకరించి విచారణ పేరుతో కాలపరిమితి ముగిసినా తిరిగి చెల్లించరు. కార్యదర్శులు మినిట్ బుక్‌లో రాసిందే శాసనం. విచారణాధికారులే కింగ్ మేకర్లుగా మారి సమస్య సృష్టించి దానిని ఫిర్యాదుగా మలిచి దాని మీద విచారణ చేసి కావాల్సిన మేరకు దండుకుంటారు. ఇదీ జిల్లా సహకార శాఖ పరిధిలోని కొన్ని సొసైటీల్లో జరుగుతున్న అవినీతి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని కొన్ని సొసైటీల్లో రూ.కోట్ల అవినీతి జరుగుతున్నా ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించడం లేదు. దీనిని బట్టి అవినీతి ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా టి.నర్సాపురం సొసైటీలో రూ.15 కోట్లకుపైగా డిపాజిట్లను తిరిగి ఇవ్వాలని రైతులు ఆందోళన నిర్వహించి సొసైటీకి తాళం వేయించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 258 సహకార సంఘాలున్నాయి. వీటి పరిధిలో ఏటా సుమారు రూ.5 వేల కోట్ల మేర టర్నోవర్ జరుగుతుంది. ఐదారు గ్రామాలు కలిపి సొసైటీగా ఏర్పడి రైతులను సభ్యులుగా చేర్చుకుని సొసైటీ ద్వారా ఎరువులు, పురుగు మందులు విక్రయించడం, రైతుల నుంచి డిపాజిట్లు స్వీకరించడం, రైతులకు రుణాలు ఇస్తూ కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. రూ.50 కోట్ల పైగా టర్నోవర్ జరిగే సొసైటీలు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి. ఆదాయం పెరిగి వృద్ధిలోకి వస్తే సేవలు విస్తరించాలి. ఆదాయం పెరిగే ప్రతి సొసైటీలో అవినీతి పెరగడం స్థానిక ఉద్యోగులు మొదలుకొని జిల్లా స్థాయి అధికారుల వరకు పెంచి పోషిస్తూ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు.

రూ.100 కోట్లకుపైగా అవకతవకలు

జిల్లాలో గంగన్నగూడెం, విజయరాయి, జోగన్నపాలెం, చింతలపూడి, రాఘవాపురం, పోతునూరు, టీ. నర్సాపురం ఇలా సుమారు 25కుపైగా సొసైటీల్లో అవకతవకలు జరిగాయి. కొద్దిమందిపై విచారణ, సస్పెన్షన్లతో కోట్లాది రూపాయల అవినీతిని మరుగున పడేస్తున్నారు. కొన్నిచోట్ల వ్యవహారం బయటకు వచ్చినా ఇబ్బంది లేకుండా రికార్డులను తమదైన శైలిలో మార్చి మొక్కుబడి ఎంక్వైరీ పేరుతో ఫైల్స్ మూసేస్తున్నారు. చింతలపూడి సొసైటీలో రూ.30 కోట్ల మేర అవినీతి జరిగింది. 8,928 మంది సభ్యులున్న సొసైటీలో ఏటా సగటున రూ.61.22 కోట్ల మేర టర్నోవర్ జరుగుతుంది. గతంలో ఈ సొసైటీలో రైతులకు తెలియకుండా రూ.కోట్ల రుణాలు సొసైటీ, శాఖలోని కీలక వ్యక్తులే తీసుకున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో విచారణ నిర్వహించారు. నిబంధనల ప్రకారం ఆరు నెలల్లోపు పూర్తి చేసి చర్యలు తీసుకోవాలి.

అవకతవకలు పరిశీలిస్తాం

సహకార సొసైటీలో జరిగిన అవినీతి, విచారణలు పూర్తిగా మా దృష్టికి రాలేదు. కొత్తగా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించాను. అన్నింటిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామం.

– కే.వెంకటేశ్వరరావు, జిల్లా సహకార శాఖ ఇన్‌చార్జి

టి.నర్సాపురం సొసైటీకి తాళం

టి.నర్సాపురం సొసైటీలో గతంలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. కొన్నేళ్లుగా త్రిసభ్య కమిటీతో సొసైటీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. 370 మందికి సంబంధించి రూ.15 కోట్ల మేర మెచ్యూరిటీ పూర్తయినా డబ్బు ఖాతాల్లో జమ చేయలేదని ఆగ్రహించిన రైతులు డిపాజిట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సొసైటీ సిబ్బందితోనే తాళాలు వేయించి సొసైటీ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

అక్రమాలకు సహకరిస్తున్న విచారణాధికారులు

విచారణాధికారి అన్ని విధాలా సహకారం అందించి ఆరు నెలల్లో జరగాల్సిన విచారణను నిలుపుదల చేస్తూ.. సొసైటీ సభ్యులు కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చేలా సాయపడుతున్నారు. సీజ్ చేసిన సొసైటీ రికార్డులు విచారణాధికారి వద్ద ఉంటాయి. దాంట్లో ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62కు మార్చి కమిటీ తీర్మానం చేసినట్లు రికార్డు ట్యాపరింగ్ చేసి మరీ ప్రత్యేకంగా ఉత్తర్వులు తెచ్చారు. అనేక సొసైటీల్లో ఇదే తరహా వ్యవహారాలు జరిగాయి. గంగన్నగూడెంలో రూ.25 లక్షలు, జోగన్నపాలెంలో రూ.75 లక్షలు, చింతలపూడిలో రూ.30 లక్షలు, రాఘవాపురంలో రూ.40 లక్షలు, పోతునూరులో రూ.30 లక్షలకుపైగా జరిగిన అవినీతిలో కొద్ది మందిని సస్పెండ్ చేశారు. కీలక విచారణాధికారి మాత్రం విచారణ నిర్వహించి రిపోర్టును మాత్రం ప్రత్యేక వ్యవహారాలతో పెండింగ్‌లో ఉంచారని ఆరోపణలు ఉన్నాయి. సదరు విచారణాధికారికి ప్రత్యేకంగా నలుగురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ఒక సీనియర్ ఇన్‌స్పెక్టర్‌తో బృందం ఉంటుంది. సదరు బృందమే సొసైటీల్లోని తప్పులు తెలుసుకుని సొసైటీ కార్యదర్శులను పిలిచి మాట్లాడి రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు, తీవ్రతను బట్టి రూ.20 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ప్రతి సొసైటీలో ఆడిట్ పూర్తి చేసి బేరం కుదిరితేనే సర్టిఫికెట్ ఇచ్చేలా వ్యవహారం సాగిస్తున్నారు. సొసైటీల్లో జరుగుతున్న అవినీతి వ్యవహారంపై ఇటీవల కొందరు ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేసి సహకార శాఖకు సంబంధం లేని వ్యక్తితో విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్లీజ్.. వెళ్లొద్దు టీచర్



టీచర్ బెజవాడ ప్రసన్న దుర్గను పట్టుకుని ఏడుస్తున్న విద్యార్థులు

ఆకివీడు: కొన్నేళ్లుగా తమ పాఠాలు చెప్పిన టీచరు వెళ్లిపోతుంటే ఆ విద్యార్థులంతా కన్నీరు పెట్టుకున్నారు. ఈ సంఘటన ఆకివీడు మండలం సిద్ధాపురంలో జరిగింది. సిద్ధాపురం ఎంపీపీ పాఠశాలలో 8 ఏళ్లు పనిచేసిన ఉపాధ్యాయురాలు బెజవాడ ప్రసన్న దుర్గ ఇటీవల దుంపగడప ఎంపీపీ పాఠశాలకు బదిలీ అయ్యారు. సిద్ధాపురం పాఠశాలలో శనివారం ఆమెకు వీడ్కోలు సభ నిర్వహించారు. అదే సమయంలో విద్యార్థులు «అమ్మా నువ్వు వెళ్లవద్దు, మా స్కూల్లోనే ఉండు, మాతోనే ఉండు» అంటూ కన్నీరు పెట్టుకున్నారు. విద్యార్థులతో పాటు అక్కడున్న తల్లిదండ్రులు, స్థానికులు కంట తడిపెట్టారు. పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలను నాడు–నేడులో ఎంతో సుందరంగా తీర్చిదిద్దారన్నారు. తమ పిల్లలకు కావాల్సిన వసతులు కల్పించారన్నారు. ఇలాంటి ఉపాధ్యాయురాలు బదిలీ అయితే తమకు, తమ గ్రామానికి కూడా నష్టమేనన్నారు.

ఆక్వా రైతుల ఆందోళన



సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ఆక్వా రైతులు

యలమంచిలి: అప్రకటిత విద్యుత్ కోతలతో నష్టపోతున్నామని చించినాడ గ్రామానికి చెందిన ఆక్వా రైతులు శనివారం కాజ పడమర గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. అర్థరాత్రి సమయంలో కనీస సమాచారం లేకుండా కోతలు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చించినాడ లంకలో వర్షం కురిస్తే నడిచి వెళ్లడానికి కష్టంగా ఉందన్నారు. కనీస సమాచారం లేకుండా విద్యుత్ కోత విధించడంతో చెరువుల వద్దకు వెళ్లి జనరేటర్స్ వేసుకోవడం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి వెంటనే లైన్‌మెన్‌ను నియమించాలని, ఇకపై విద్యుత్ కోతలు ఉంటే సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ ఏఈ కిరణ్‌కు వినతిపత్రం ఇచ్చారు.

తిరువన్నామలైకు ప్రత్యేక రైలు

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం నుంచి తిరువన్నామలై (అరుణాచలం)కు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ డీఆర్‌యుసీసీ సభ్యుడు జక్కంపూడి కుమార్ తెలిపారు. నరసాపురం నుంచి అరుణాచలం 07219 నెంబరు, అరుణాచలం నుంచి నరసాపురం 07220 నెంబరుతో రైలు నడుస్తుందన్నారు. నరసాపురం నుంచి ప్రతి బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. అరుణాచలంలో గురువారం ఉదయం 11 గంటలకు బయలుదేరి శుక్రవారం ఉదయం 3 గంటలకు నరసాపురం చేరుకుంటుందన్నారు. 8 వారాలు పాటు ఈ ప్రత్యేక రైలు నడుస్తుందన్నారు.

10న పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం



పేరెంట్స్ మీటింగ్‌పై అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: జూలై 10న జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, జూనియర్ కాలేజీలో నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశానికి సంబంధించి శనివారం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి విద్యార్థి మొక్కను నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ ఏడీ ఎస్.సత్యనారాయణ, ఫారెస్ట్ అధికారి డి.ఆశా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా కొండేటి



కొండేటి శివకుమార్ గౌడ్

ఆకివీడు: వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా కొండేటి శివకుమార్ గౌడ్‌ను నియమిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. కాళ్ల మండలం జువ్వలపాలెం సర్పంచ్‌గా పనిచేసిన కొండేటి పార్టీ ఆవిర్భావం నుంచి చురుగ్గా పని చేస్తున్నారు. తన సేవల్ని గుర్తించి బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు ధన్యవాదాలు చెప్పారు. పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఉద్యమమే



విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న దృశ్యం

భీమవరం: టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ స్మార్ట్ మీటర్లను నేలకేసి బద్దలు కొడతామని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చాక విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించేస్తున్నారని దీనిపై ప్రభుత్వం పునరాలోచించకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, సహాయ కార్యదర్శి మల్లుల శ్రీనివాసరావు హెచ్చరించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని నిలిపివేయాలని, అదానీతో సోలార్ విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలని, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ భీమవరంలో విద్యుత్ ఏడీఈ కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ వినియోగదారుల గొంతు కోసి అదానీ, షిర్డీ సాయి కంపెనీలను ఉద్ధరించడానికే కూటమి సర్కారు ముందుకెళ్తోందని ఆరోపించారు.

గీత కార్మికులపై కక్ష గట్టారు



భీమవరంలో కల్లుగీత కార్మిక సంఘం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: వైఎస్సార్‌సీపీ పాలనలో బెల్ట్ షాపులు, అక్రమ మద్యం అమ్మకాలను కట్టడి చేస్తే నేటి కూటమి ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు, మద్యం సిండికేట్లు, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కూటమిగా ఏర్పడి రాజ్యాంగేతర శక్తిగా పాలన చేస్తున్నారని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదరి జుత్తిగ నర్సింహామూర్తి విమర్శించారు. శనివారం కడలి పాండు అధ్యక్షతన జరిగిన భీమవరం డివిజన్ కల్లుగీత కార్మికుల సమావేశంలో గీత కార్మిక సంఘం కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో గీత కార్మికులకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల కుటుంబాలపై కక్ష గట్టి విచ్చలవిడిగా బెల్టుషాపులు పెట్టించి కల్లు అమ్మకాలు లేకుండా దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎక్స్‌గ్రేషియో రద్దుచేసి గీతకార్మిక కుటుంబాలకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. సమావేశంలో చింతపల్లి చినవీరాస్వామి, తుంగ సాయిబాబు, కొప్పిశెట్టి వెంకట సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ, వీరవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సముద్రపు రక్షణ గోడ పనుల పరిశీలన



పీఎం లంకలో పరిశీలిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అనిరుథ్, కలెక్టర్ తదితరులు

నరసాపురం రూరల్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామం పీఎం లంకలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్థిక శాఖ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అనిరుథ్ ఎస్ పులిపాక, కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పీఎం లంక గ్రామంలో డెలాయిట్ కంపెనీ, సీఎస్ఆర్ ఫండ్స్‌తో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. డిజిటల్ భవన్‌లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను పరిశీలించి విద్యార్థులు ఏఏ ప్రాంతాల నుంచి వచ్చి శిక్షణ పొందుతున్నారని అడిగి తెలుసుకున్నారు. సముద్రపు రక్షణ గోడ నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. రక్షణ గోడ సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కేంద్ర మంత్రి వ్యక్తిగత సహాయకుడు విష్ణు సింగ్, ఆర్డీవో దాసిరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



మొర్సపూడిలో రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

నూజివీడు: మండలంలోని మొర్సపూడిలో అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ డీటీ జీ వెంకటేశ్వరరావు, వీఆర్వో నాగరాజు గ్రామస్తులతో కలిసి శనివారం పట్టుకున్నారు. రేషన్ షాపులోని బియ్యాన్ని ట్రక్కు వాహనంలోకి లోడు చేస్తుండగా గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించడంతో హుటాహుటిన మొర్సపూడికి చేరుకొని ట్రక్కు వాహనంలో ఉన్న 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న రేషన్ డీలర్ గొడవర్తి అచ్చయ్య, రేషన్ బియ్యం అక్రమ వ్యాపారి సోలా రాములపై 6ఏ కేసు నమోదు చేశారు.

అనుమతి లేని బస్సులపై అపరాధ రుసుం

తాడేపల్లిగూడెం: అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలకు చెందిన బస్సులకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జరిమానా విధించారు. డీటీఓ ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. పిప్పర పరిధిలోని స్కూల్స్ బస్సుల్లో ఒకటి టాక్స్ లేకుండా, మరొకటి ఎఫ్‌సీ లేకుండా తిరుగుతున్నట్టుగా గుర్తించారు. ఈ మేరకు ఆ బస్సుల యజమానుల నుంచి రూ.39 వేల అపరాధ రుసుంను వసూలు చేశారు. గూడెం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాయక్, అసిస్టెంటు ఇన్‌స్పెక్టర్ సుబ్బలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

జంతువుల వ్యాధులతో జర జాగ్రత్త..!

- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం
- ఏలూరు జిల్లాకు 25 వేల ఉచిత రేబీస్ వ్యాక్సిన్లు
- బ్రూసెల్లోసిస్ అంటువ్యాధిపై ప్రజలకు అవగాహన
- జిల్లాలో 134 పశువైద్యశాలల్లో కుక్కలకు ఉచిత టీకాలు

కైకలూరు/కొయ్యలగూడెం : మనుషుల నుంచి జంతువులకు, జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారు. పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి 1885లో ఫ్రెంచ్ జీవశాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ రేబీస్ టీకాను ప్రయోగించి, విజయం సాధించిన సందర్భంగా ప్రతి ఏటా జూలై 6న జూనోసిస్ దినోత్సవం జరుపుతారు. జూనోసిస్ డే సందర్భంగా జిల్లాలో పశువైద్యశాలల్లో ఆదివారం కుక్కలకు ఉచిత రేబీస్ టీకాలు వేస్తారు.

జూనోటిక్ వ్యాధులపై అప్రమత్తత

జంతువుల నుంచి సోకే వ్యాధులపై అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. జంతువుల లాలాజలం, రక్తం, మూత్రం, శ్లేష్మం, మలం, ఇతర శరీర ద్రవాల కారణంగా మనుషులకు జూనోటిక్ వ్యాధులు సోకుతాయి. వీటిలో పాడి పశువుల నుంచి ఆంత్రాక్స్, బ్రూసిల్లోసెస్, లప్టిరియోసిస్, రింగ్ వార్మ్ వ్యాధులు, గొర్రెలు, మేకలు నుంచి హైడాటిడోసిస్, సార్కోసిష్టిస్, ఆంత్రాక్స్, బ్రూసిల్లోసెస్, లప్టిరియోసిస్, సాల్మోనెల్లోసిస్, క్యూ-పివర్, మేంజ్ వ్యాధులు, కుక్కల నుంచి రేబీస్, లీష్మేనియా, బద్దెపురుగుల వ్యాధి, రింగ్ వార్మ్, హైడాటిడోసెస్, మీసిల్స్, మంప్స్, మేంజ్ వ్యాధులు సోకుతున్నాయి. జూనోటిక్ వ్యాధులు ఎక్కువగా కేన్సర్ వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, గర్భిణీ రోగులు, 5వ సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలిగిన పిల్లలు, అడవిలో జంతువులతో సహజీవనం చేసే వ్యక్తులకు సోకే అవకాశం ఉంది.

జిల్లాలో 25 వేల ఉచిత రేబీస్ టీకాలు

ఏలూరు జిల్లాలోని 7 నియోజకవర్గాలకు కలిపి మొత్తం 25 వేల ఉచిత రేబీస్ టీకాలు వచ్చాయి. జిల్లాలో ప్రాంతీయ పశువైద్యశాలలు 11, వెటర్నరీ డిస్పెన్సరీలు 66, గ్రామీణ పశు వైద్యశాలలు 57, రైతు సేవాకేంద్రాలు 315 ఉన్నాయి. వీటి పరిధిలో ఆవులు, గేదెలు కలిపి 6,01,589, మేకలు, గొర్రెలు కలిపి 8,06,374, కుక్కలు 15,222 (వీధి కుక్కలు మినహాయించి)గా గుర్తించబడ్డాయి. ఆదివారం ఉదయం నుంచి ఆయా కేంద్రాల్లో పశువైద్యులు ఉచితంగా రేబీస్ టీకాలు అందిస్తారు. అదే విధంగా జూనోటిక్ వ్యాధులపై పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కలిగిస్తారు.



మనుషులకు సోకుతున్న బ్రూసెల్లోసిస్ వ్యాధి

బ్రూసెల్లోసిస్ వ్యాధి జంతువుల నుంచి మనుషులకు సోకే ఒక ముఖ్యమైన జూనోటిక్ వ్యాధి. వ్యాధి సోకిన జంతువులు, కలుషితమైన జంతు ఉత్పత్తులు, ప్రయోగశాలలో బ్రూసెల్లోసిస్ సోకిన జంతువుల ద్రావములను తాకడంతో మానవులకు ఇది వ్యాపిస్తోంది. పశువైద్యులు, పాడి రైతులు, కబేళాల కార్మికులకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఇదే కాకుండా పాశ్చరైజ్ చేయని పాల ఉత్పత్తులు, వ్యాధి సోకిన జంతువుల నుంచి ఉడికించని మాంసం తీసుకోవడం వల్ల కూడా ఇది సోకుతోంది. జ్వరం, కీళ్ల నొప్పులు, అలసట, నీరసం. మగవారిలో వృషణాల వాపు, కుచించుకుపోవడం, వంధ్యత్వానికి గురవుతున్నారు.

46 వేల బ్రూసెల్లా ఉచిత టీకాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ యానిమల్ డీసీస్ కంట్రోల్ ప్రోగ్రాం(ఎన్ఏడీసీపీ)లో భాగంగా బ్రుసెల్లా వ్యాధిని 2030 నాటికి నిర్మూలించాలనే ధ్యేయంతో మూడేళ్లగా ఉచిత వ్యాధి నిరోధక టీకాలు అందిస్తున్నారు. ఏలూరు జిల్లాలో మూడు విడతల్లో 46 వేల బ్రుసెల్లా వ్యాధి నిరోధక టీకాలు 4–8 నెలల మధ్య వయస్సు కలిగిన ఆడ దూడలకు మాత్రమే ఉచితంగా అందించారు. అది జీవితకాలం వ్యాధి సోకకుండా రక్షణ ఇస్తుంది.

టీకాలు తప్పనిసరి



పెంపుడు జంతువులతో మానవులకు అవినాభవ సంబంధం ఉంది. ప్రతి ఒక్కరూ పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. జూనోటిక్ వ్యాధులపై అందరూ అవగాహన పెంచుకోవాలి. పశు సంవర్థకశాఖ ద్వారా ఏటా జూనోసెస్ డే సందర్భంగా ఉచిత రేబీస్ టీకాలు వేస్తున్నాం. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ పఠాన్ ముస్తాఫా ఖాన్, పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు, కైకలూరు

రేబీస్ వ్యాధి సులభంగా వ్యాపిస్తుంది



ఇది కేవలం కుక్క కాటుతోనే కాక, వ్యాధిసోకిన జంతువు లాలాజలం గాయాల మీద పడితే కూడా వ్యాపిస్తుంది. రేబీస్ అనేది ఒక ప్రాణాంతకమైన వ్యాధి. కాబట్టి, కుక్కలు, పిల్లుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం, టీకాలు వేయించడం చాలా ముఖ్యమైనది. కాటు సంభవించినప్పుడు వెంటనే వైద్యుని సంప్రదించి రేబీస్ వ్యాధి వ్యాప్తిని నిరోధించడం చాలా అవసరం.

– బీఆర్ శ్రీనివాస్, పశు వైద్యాధికారి, కొయ్యలగూడెం

18 నుంచి బ్యాడ్మింటన్ టోర్నీ

తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు చిట్టూరి సత్య ఉషారాణి, కార్యదర్శి మెంటే వంశీకృష్ణ తెలిపారు. అండర్ 11, 13, 15, 17, 19 బాలురు, బాలికలు, పురుషులు, మహిళలతోపాటు వెటరన్స్ 35, 40, 50, 55, 60, 70 వయస్సు విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామని, విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారని వివరించారు. పోటీలకు ఎస్‌కేఎస్‌డీ గ్రూప్ ఆఫ్ కాలేజ్ స్పాన్సర్ చేస్తున్నట్లు ఆ సంస్థ గ్రూప్ ఆఫ్ కాలేజ్ సహాయ కార్యదర్శి చిట్టూరి వెంకట కృష్ణారావు తెలిపారు. వివరాలకు టోర్నమెంట్ ఆర్గనైజర్, కార్యదర్శి ఎన్.సతీష్‌బాబు 98496 66223, 97014 04675 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మూడు రోజులకే శిశువు మృతి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చి అధిక రక్తస్రావంతో మూడు రోజులు క్రితం తల్లి సంగినీడి జయశ్రీ మృతి చెందిన విషయం తెలిసిందే. గత మూడు రోజులుగా భీమవరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ శిశువు శనివారం ఉదయం మృతి చెందడం అందరిని కలచివేసింది. బ్రెయిన్‌లో చలనం లేకపోవడంతో వెంటిలేటర్‌పై ఉంచినా కష్టమేనని వైద్యులు శుక్రవారం శిశువును ఇంటికి పంపించేసినట్లు బంధువులు తెలిపారు. శనివారం ఆ శిశువు కూడా మృతి చెందడంతో వారంతా కన్నీరు మున్నీరయ్యారు. డాక్టర్ నిర్లక్ష్యం వల్లే తల్లి, శిశువు మృతి చెందారని బంధువులు బోరున విలపిస్తున్నారు.

తొలి ఏకాదశి.. పుణ్యాల రాశి

నేడు శ్రీవారి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ద్వారకాతిరుమల: ఆషాఢ మాసంలో వచ్చే మొదటి ఏకాదశిని తొలి ఏకాదశి అని అంటారు. ఈ ఏకాదశి నుంచే పండుగలన్నీ మొదలవుతాయి కాబట్టి దీన్ని తొలి పండుగ అని పిలుస్తారు. ఈ ఏకాదశిని శయన ఏకాదశి, దేవశయన ఏకాదశి, పద్మ ఏకాదశి అని కూడా అంటారు. ఆదివారం తొలి ఏకాదశి కాగా పండుగ విశిష్టతను శ్రీవారి దేవస్థానం ఆగమ పండితులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు మాటల్లో తెలుసుకుందాం.

తొలి ఏకాదశి విశిష్టత

ఈ రోజు నుంచి నాలుగు నెలల పాటు (కార్తీక మాసం శుక్ల ఏకాదశి (ప్రబోధిని ఏకాదశి) వరకు) విష్ణుమూర్తి పాలకడలిపై నిద్రిస్తారు. ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాసం అంటారు. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల్లోనూ ఈ రోజు మొదటిది. అందుకే ఈ రోజు ఉపవాసం ఉంటే విష్ణుమూర్తి అనుగ్రహం తప్పక లభిస్తుంది. అందుకోసం దశమి రాత్రి నుంచే నిరాహారంగా ఉండాలి. ఏకాదశి రోజు ఉదయాన్నే నిద్రలేచి విష్ణుమూర్తిని తులసీదళాలతో పూజించాలి. రాత్రి అంతా జాగరణ చేస్తూ భాగవతం లేదా విష్ణుసహస్రనామ పారాయణం చేయాలి. మరుసటి రోజు అంటే ద్వాదశి రోజు దగ్గరలోని ఆలయానికి వెళ్లి ఉపవాస దీక్షను విరమించాలి. దీనినే తొలి ఏకాదశి వ్రతం అని అంటారు. ఈ రోజున అన్నం, మాంసాహారం తినకూడదు. తులసి ఆకులు కోయడం, జుట్టు, గోర్లు కత్తిరించుకోవడం, గొడవలు, దుర్భాషలాడటం, పగలు నిద్రపోవడం, ఇతరులను అవమానించడం, చెడుగా ఆలోచించడం, దానం నిరాకరించడం వంటివి చేయరాదు.

శ్రీవారి క్షేత్రంలో..

ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం విశేష కార్యక్రమాలు జరగనున్నాయి. అందులో భాగంగా రాత్రి స్వామివారి గ్రామోత్సవం క్షేత్ర పురవీధుల్లో కన్నుల పండువగా జరగనుంది. తొలి పండుగ కావడంతో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శిస్తారని ఆలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పోలవరంపై చంద్రబాబు వాస్తవాలు బయట పెట్టాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

చింతలపూడి : పోలవరం ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు వాస్తవాలు బయటపెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. చింతలపూడిలో ఏలూరు జిల్లా సీపీఐ ద్వితీయ మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ఎత్తు 41.15 మీటర్లు తగ్గించినట్లు కేంద్ర ప్రభుత్వమే తెలిపిందని, దీనిపై చంద్రబాబు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. చంద్రబాబు ఇప్పుడు కొత్తగా పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు అంటూ ప్రజలను ఏమారుస్తున్నారన్నారు.

సూపర్ సిక్స్ ఎక్కడ బాబూ

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ప్రజలకు ఒరిగిందేమీ లేదని, సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 20 ఏళ్లపాటు రూ.1.10 లక్షల కోట్ల భారాన్ని విద్యుత్ చార్జీల పెంపు రూపంలో ప్రజలపై ప్రభుత్వం మోపుతుందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తే తప్పు అన్న చంద్రబాబు, లోకేష్ ఇప్పుడు ఎందుకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాల్సి వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షత వహించగా జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి కేవీపీ ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు, మండల కార్యదర్శి టి.బాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కాలువలో పడి రౌడీషీటర్ మృతి



కాలువలో పడి ఉన్న సాయి మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ పరిధిలో ఒక రౌడీషీటర్ మద్యం మత్తులో ఒక మురికి కాలువలో పడి ఊపిరాడక మృతిచెందాడు. వివరాల ప్రకారం.. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని వంగాయగూడేనికి చెందిన బలిరెడ్డి విజయసాయి (36) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. విజయసాయిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రస్తుతం రౌడీషీట్ కొనసాగుతోంది. మద్యం సేవించిన సాయి శనివారం తెల్లవారు జామున వంగాయగూడెం వైపు నుంచి వస్తూ అక్కడి మురికి కాలువపై ఉన్న గట్టుపై పడుకున్నాడు. పూటుగా మద్యం సేవించి ఉండడంతో ప్రమాదవశాత్తు కాలువలో పడి ఊపిరాడక మృతిచెందాడు. ఈ విషయంపై పోలీసులు సీసీ కెమెరాల పుటేజ్ పరిశీలించి మృతుడు కాలువ గట్టుపై పడుకుని ప్రమాదవశాత్తు జారిపడినట్లు గుర్తించారు. అనంతరం సాయి మృతదేహానికి జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై నాగబాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల విద్య.. భద్రత మిథ్య

- పోలసానిపల్లి గురుకులంలో శిథిలావస్థకు చేరిన భవనాలు
- విద్యార్థినుల భద్రత దృష్ట్యా వేరే ప్రాంతానికి తరలింపు చర్యలు
- రాష్ట్ర స్థాయి అధికారుల నిర్ణయం కోసం ఎదురుచూపు



కూలిన రెండు ల్యాబ్‌లు (ఫైల్)

భీమడోలు: అధికారుల నిర్లక్ష్యం.. గురుకుల విద్యార్థినుల పాలిట శాపంగా మారింది. శిథిలావస్థకు చేరిన భవనాల్లోనే గురుకుల విద్య తరగతులు నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు రేపుతోంది. ఏ క్షణాన ఏ భవనం కూలిపోతుందోనని, తమ పిల్లల పరిస్థితి ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పోలసానిపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల భవనంలోని రెండు ల్యాబ్‌లకు చెందిన శ్లాబ్‌లు మే 30వ తేదీన రాత్రి సమయంలో కూలిపోయాయి. అయితే వేసవి సెలవులు కావడం, రాత్రి పూట కూలడంతో పెను ప్రమాదమే తప్పింది. ఈ నేపథ్యంలో విద్యార్థినుల భద్రతపై ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో సంబంధిత గురుకుల సొసైటీ అధికారులు పరిస్థితిని సమీక్షించారు. పాత భవనాలు క్షేమం కాదని కళాశాలను తాత్కాలికంగా వేరే ప్రదేశానికి మార్చాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. భీమడోలు, ద్వారకా తిరుమల, నల్లజర్ల మండలాల్లో ఎక్కడైనా అద్దె భవనాన్ని తీసుకుని విద్యార్థినులకు తరగతులు నిర్వహించేలా తగు చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇందుకు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.

బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తూ

పోలసానిపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 710 మంది విద్య అభ్యసిస్తున్నారు. టీచర్లు, కార్యాలయ సిబ్బంది, ఇతర సిబ్బందితో కలిసి 100 మందికి పైగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడం, తరచూ వంటశాల, భోజన శాల, డార్మిటరీల్లో శ్లాబ్‌లు ఊడి కింద పడుతుండడం, అంతేగాకుండా హాస్టల్ ఆవరణలో విష సర్పాలు సంచరించడంతో విద్యార్థినులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో జూన్ 12వ తేదీ నుంచి తరగతులు పునఃప్రారంభమైనా విద్యార్థినులను ఎక్కువ మంది ఇక్కడ చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఏడు వందల మందికిగాను కేవలం 180 మంది బాలికలు మాత్రమే హాజరవుతున్నారు.

బడ్జెట్ కేటాయింపులేవి?

ప్రతి ఏటా గురుకులాల్లో మౌలిక వసతులు, మరమ్మతులకు బడ్జెట్‌లో గురుకుల సొసైటీ ఉన్నతాధికారులు నిధులు కేటాయించకపోవడమే ఈ పరిస్థితికి కారణమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం పొంచి ఉన్నా శిథిలావస్థకు చేరిన భవనాలకు కనీసం మరమ్మతులు నిర్వహించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెచ్చులూడుతున్న భోజన శాల



బిక్కుబిక్కుమంటూ భోజనం చేస్తున్న బాలికలు(ఫైల్)



చిట్టడవిని తలపించేలా పోలసానిపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

పోలసానిపల్లి గురుకుల కళాశాల పరిస్థితిపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు డీసీవో బి.ఉమాకుమారి తెలిపారు. కళాశాలను వేరే ప్రాంతానికి తరలించే నిర్ణయంపై వారం రోజుల్లో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. అలాగే భవనాల్లోని పటుత్వాన్ని గుర్తించేందుకు ఉన్నతాధికారులతో సంప్రదిస్తుమని, వారిచ్చే నివేదికను సొసైటీ ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. విద్యార్థినుల భద్రతే లక్ష్యంగా తమ వంతు కృషి చేస్తున్నామని, బాలికల తల్లిదండ్రులు ఆందోళన చెందనవసరం లేదని వెల్లడించారు.

అభిరామ్ హాస్పిటల్స్
వాటర్ ట్యాంక్ దగ్గర, జువ్వలపాలెం రోడ్, భీమవరం-2, ఫోన్: 08816-223728
రుమటాలజిస్ట్ చెన్నై నుండి రాక
డా॥ కవిత M.D, DNB, D.M. (Rheumatology)
కీళ్ళవాతం, ఆర్థరైటిస్, గౌట్, SLE మొ॥ వ్యాధుల చికిత్సా నిపుణులు
తారీఖు గారు తే: 12-7-2025 (శనివారం) విచ్చేయుచున్నారు.
అపాయింట్‌మెంట్ కొరకు: 98854 22345, 96662 61803, 08816-223728

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE
■ మీ పెట్టుబడికి ఇదే సరైన సమయం రాజధాని ప్రాంతంలో అమరావతి - విజయవాడ రోడ్‌లో గృహ నిర్మాణానికి అనువైన ప్లాట్లు చ.గ. రూ.13 వేలు మాత్రమే స్పాట్ రిజిస్ట్రేషన్ 9966666084 [G-70]

FLAT FOR SALE
■ RJY హుకుంపేట రామకృష్ణ నగర్‌లో నూతన గ్రూప్‌హౌస్ నందు నాలుగు 2 BHK ఫ్లాట్స్ అమ్మకము. హౌసింగ్‌లోన్ మరియు 5,00,000 పర్సనల్ లోన్ ఇప్పించబడును. ✆ : 90002 54511 [R-7631]

HOUSE FOR SALE
■ ఏలూరు-సత్రంపాడు సాయినగర్ లో ఉత్తర ఫేస్ 110 గ॥ల్లో G+1 బిల్డింగ్ అన్ని వసతులు తో అమ్మకమునకు కలదు. 8466891621, 6302463874 [SCA-25005708]

LAND FOR SALE
■ తాడేపల్లిగూడెం యాగర్లపల్లి కరెంట్ ఆఫీస్ దగ్గరలో 800 చ.గ. తూర్పు ఫేసింగ్ స్థలం అమ్మకానికి కలదు. సంప్రదించండి : 99895 15392, 98498 49363. [SCA25005857]

Services

జ్యోతిష్యాలయం
■ కేరళ భగవతీ భద్రకాళి మాంత్రిక జోతిష్యం ప: వి.ఫణికర్, స్త్రీ/పు వశీకరణం, ప్రేమ పెళ్ళి, సంతానం, శత్రుబాధ, ప్రేమలో మోసపోవడం మీ ఎటువంటి కఠిన నిగూఢ వ్యక్తిగత గుప్త సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9573872341 [SCA25005839]

Wanted
■ కేర్ టేకర్స్, నర్సులు కావలెను. VJAలో ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్‌లో ఇంటివద్దనే వుండి పెద్దవారిని చూసుకొనుటకు అనుభవంగల వర్కర్స్, మంచిజీతం ✆ 99121 15559, 91608 35559 [B-136]

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-629]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA25005931]

■ విదేశాల్లో స్థిరపడిన తెలువారికి ఇంటి/వంట పనికి 45సం॥ల స్త్రీ కావలెను. వీసా గల వారికి ప్రాధాన్యం. జీ: 80K. ఫోన్: 9573943211 [SCA25006014]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ పాలకొల్లుకి 5 కి.మీ దూరంలో యలమంచిలి మండలం, ఊటాడ గ్రామంలో భర్త పొలం పని, భార్య ఇంట్లో పనిచేయుటకు భార్యభర్తలు కావలెను. వయస్సు : 30-50 సం॥రాలు, వసతి + జీతం ఇవ్వబడును. సెల్ : 90526 08646 [SCA25005972]

www.sakshi.com సాక్షి స్పోర్ట్స్

గమనిక
సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కెనరా బ్యాంక్ Canara Bank
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం
మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాబాగ్, విశాఖపట్నం-530020.
ఫోన్: 8332956773, 7095199455, ఇ-మెయిల్: cb13591@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

[illegible]

ఇ-వేలం తేది & సమయం: 24.07.2025, మ॥ 3.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేదీ: 24.07.2025, మధ్యాహ్నం 02.00 గం.ల లోపు

వ. నెం	ఋణగ్రహీత / హామీదారులు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నంకు బదిలీ చేయబడ్డాయి)	బకాయి మొత్తం	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	[illegible]	రూ. 161.22 లక్షలు	ఆస్తి-1: [illegible]	రూ. 19.20 లక్షలు	రూ. 1.92 లక్షలు
			ఆస్తి-2: [illegible]	రూ. 16.00 లక్షలు	రూ. 1.60 లక్షలు
2	[illegible]	రూ. 61.00 లక్షలు	[illegible]	రూ. 30.07 లక్షలు	రూ. 3.01 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: 17.07.2025, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించవలెను. ఫోన్: 8332956773, 7095199455.
[illegible]
ఖాతా నెం. 209272434, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్: CNRB0013591 కు తేది: 24.07.2025, మ॥02:00 గం.ల లోపుగా చెల్లించవలెను.
[illegible]
బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో పెంచవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ. 50,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడరును సంప్రదించండి మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet). వెబ్‌పోర్టల్ https://baanknet.com.
హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com
తేది: 03.07.2025, ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

క్లుప్తంగా

నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన 'కొట్టు'



నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామానికి చెందిన కాటుబోయిన నాగేశ్వరరావు (95) వయోభారంతో ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా శనివారం వారి కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. నాగేశ్వరరావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, జడ్డు హరి బాబు, వెలిశెట్టి నరేంద్రకుమార్, ములకాల రాంబాబు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కసుపూరి ఉదయభాస్కర్, పత్సా అంజిబాబు, పత్సా లక్ష్మణరావు ఉన్నారు.

వరాల వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అత్తిలి: ఈదూరు గ్రామంలో వరాల వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ జరిపారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పాఠశాలలో ఆటోమోటివ్ ల్యాబొరేటరీ ప్రారంభం



ఆటోమోటివ్ ల్యాబొరేటరీని ప్రారంభిస్తున్న హెచ్ఎం కె.పద్మావతి

తణుకు అర్బన్: తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆటో మోటివ్ ల్యాబొరేటరీని శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రారంభించారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా ఆటోమేటివ్ ల్యాబ్ మంజూరైనట్లు హెచ్ఎం కె.పద్మావతి తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం మంజూరైన ల్యాబొరేటరీని పూర్తిస్థాయిలో విద్యార్థులు సద్వినియోగపరుచుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ల్యాబొరేటరీలో వృత్తి విద్యా సంబంధమైన ఎలక్ట్రానిక్ వర్క్, ల్యాబ్ మెటీరియల్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ సోమేశ్వరరావు, ఒకేషనల్ ట్రైనర్స్ దీసేంద్ర నారాయణమూర్తి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తాం



సమావేశంలో కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని వార్డులలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించేందుకు ఈ నెల పదోతేదీ నుంచి ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్టు మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. ఈ విషయంపై ఆయన కార్యాలయంలో సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. పదో తేదీన 14వ వార్డు నుంచి 25వ వార్డు వరకు, 26వ వార్డు నుంచి 35వ వార్డు వరకు డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. 11న ఒకటో వార్డు నుంచి 13వ వార్డు వరకు పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

గార్లమ్మకు సారె సమర్పించిన గ్రామస్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మారంపల్లి గ్రామంలో శ్రీగార్లమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా శనివారం గ్రామస్తులు సారెసమర్పించారు. తొలుత అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మాజీ ఎంపీటీసీ మిద్దే కనకారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో ఉద్యోగుల మధ్య ఘర్షణ

తణుకు అర్బన్: తణుకు డీ2 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగుల మధ్య జరిగిన వాగ్వాదం దాడికి దారితీసింది. సబ్ స్టేషన్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధుల్లో ఉన్న కొప్పిశెట్టి గోపి, జూనియర్ లైన్‌మెన్ జగదీష్‌ల మధ్య శుక్రవారం ఉదయం ఘర్షణ నెలకొన్న నేపథ్యంలో గోపి ఇటుక బొంతతో దాడికి దిగగా జగదీష్‌కు తలపైభాగంలో తీవ్రగాయమైంది. వెంటనే తోటి ఉద్యోగులు అతనిని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్సనిమిత్తం చేర్చారు. విధుల్లో ఇద్దరిమధ్య ఏర్పడ్డ లాబీయింగ్‌ల నేపథ్యంలో జరిగినట్లుగా విద్యుత్ శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పట్టణ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

మరమ్మతుల్లో తణుకు 108 వాహనం

- వారం రోజులుగా అందుబాటులోలేని వైనం
- సేవల్లో జాప్యం..
- ప్రైవేటు వాహనాల్లో ఎక్కాల్సిన దుస్థితి..
- ఈనెల 1వ తేదీన తణుకులో క్షతగాత్రుడిని ట్రక్కు ఆటోలో ఎక్కించిన వైనం
- అత్యవసర సేవలు ఇలాగేనా అంటూ విమర్శలు



తణుకులో మరమ్మతులకు గురై నిలిచిపోయిన 108 వాహనం



తణుకులో 108 వాహనం రాకపోవడంతో క్షతగాత్రుడిని ట్రక్కు ఆటో ఎక్కిస్తున్న దృశ్యం (ఫైల్)

తణుకు అర్బన్: అత్యవసర పరిస్థితుల్లో ఉన్న బాధితులను వైద్యంకోసం ఆస్పత్రులకు చేర్చే 108 వాహన సేవలు తణుకులో కుంటినడక నడుస్తున్నాయి. గత వారం రోజులుగా తణుకు 108 వాహనం మరమ్మతులకు గురై మూలకు చేరడంతో సమయానికి అందాల్సిన సేవలు జాప్యమవుతున్నాయని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. రోడ్డు, ఇతర ప్రమాదాలతోపాటు అనారోగ్యంతో ఉన్నవారిని, ప్రసవం కోసం ఆస్పత్రులకు వెళ్లాల్సిన గర్భిణులను వారు కోరిన ఆస్పత్రికి సమయానికి చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న వాహనసేవలు తణుకులో అందకుండా పోతున్నాయి. వాహనం మూలకుచేరడంతో 108 సేవలకోసం కాల్ చేసిన సందర్భాల్లో ఎంతకూ వాహనం రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఆస్పత్రులకు చేరాల్సిన దుస్థితి తణుకులో నెలకొంది. పట్టణ నడిబొడ్డున జిల్లా కేంద్ర ఆస్పత్రి ఉండడంతో అధికశాతం రోగులు, గర్భిణులు అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి చేరేందుకు 108 వాహనసేవలను వినియోగించుకుంటారు. అంతేకాకుండా పెంటపాడు మండలం అల్లంపురం నుంచి సిద్దాంతం వరకు ఉన్న జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి క్షతగాత్రులు అధికశాతం ఈ వాహనంలోనే తణుకు ఆస్పత్రుల్లో చేరాల్సి ఉంది. అంతటి ప్రాధాన్యత ఉన్న తణుకు ప్రాంతంలో 108 వాహన సేవలు పూర్తిస్థాయిలో అందించలేకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

రోజుకు సుమారుగా 10 కేసులు

తణుకు కోర్టు ఆవరణలో ఉన్న 108 వాహనం తమ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం తణుకు చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లి రోగులు, గర్భిణులు, క్షతగాత్రులను ఆస్పత్రులకు చేరుస్తుంది. రోజుకు సుమారుగా 10 కేసులవరకు ఈ వాహనం సేవలందిస్తోంది. అయితే గత వారం రోజులుగా ఈ వాహనం అందుబాటులో లేకపోవడంతో 108 సంస్థ ఇరగవరం, పెనుగొండ, అత్తిలి, ఉండ్రాజవరం వాహనాలను తణుకుకు పంపిస్తుంది. అయితే ఆయా వాహనాలు ఖాళీగా లేని సమయంలో మాత్రం వాహనం వస్తుందంటూ సమాచారం ఇస్తున్నారే తప్ప సమయం గడుస్తున్నా సేవల్లో జాప్యం కలుగుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రక్కు ఆటో ఎక్కించిన దుస్థితి..

ఈనెల 1వ తేదీన తణుకు ఉండ్రాజవరం రోడ్డులో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న తణుకు వాసి దూసనపూడి దుర్గాప్రసాద్ బురదలో వాహన చక్రాలు జారిపోయి టిప్పర్ లారీ కిందకు వెళ్లి తీవ్ర గాయాలతో రాజమండ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనలో దుర్గాప్రసాద్‌కు రెండు కాళ్లు నుజ్జునుజ్జయిపోయి రక్తమోడుతున్న పరిస్థితుల్లో స్థానికులు 108 వాహనానికి ఎన్నిసార్లు ఫోన్‌చేసినా ఇదిగో అదిగో అన్నారే కానీ 40 నిముషాల వరకు వాహనం రాకపోవడంతో తప్పనిపరిస్థితుల్లో అటుగా వెళ్తున్న ట్రక్కు ఆటో డ్రైవర్‌ను బతిమలాడి ఎక్కించి ఆస్పత్రికి చేర్చాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ సమయంలో స్థానికంగా ఉన్న వారంతా 108 వాహనంతోపాటు ఆ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులపై సైతం తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పటికే చాలా వాహనాలు మరమ్మత్తులకుగురై డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, వాహనాలను కండిషన్‌లో ఉంచాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదని ప్రజానీకం దుమ్మెత్తిపోస్తున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

తణుకు అర్బన్: బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీగా రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో కార్యక్రమం నేపథ్యంలో ఆదివారం పద్మశ్రీ ఫంక్షన్ హాలులో తణుకు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయం తెలిపింది. మధ్యాహ్నం 2.30 గంటలకు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల హాజరుకానున్నారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ తణుకు మండల కమిటీ నియామకం

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తణుకు మండల పార్టీ కమిటీని పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం విడుదల చేసింది. పార్టీ ఉపాధ్యక్షుడిగా భూపతిరాజు రామకృష్ణంరాజు, కేతా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా సరెళ్ల వీరతాతయ్య, తుమ్మగంటి సీతారాముడు, సలాది హరికృష్ణ, ఆకుల సోమరాజు, కార్యదర్శులుగా పాలా శ్రీను, మడిచెర్ల శివకృష్ణ, నక్కా రమేష్, కడియం వీరబాబు, ఎం.రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెండర్లుగా చుండ్రు శ్యామల రత్నకుమారి, బర్రే శ్రీను, కండిబోయిన రామకృష్ణ, పేరిచర్ల సతీష్, కోట స్వామీజీ, మానేపల్లి సంపతరావు, చెల్లబోయిన నాగరాజు, కొన్నల ఏసు సోమేశ్వరరావు, మల్లెపూడి బాల కోశయ్య, కోరు రాంబాబు, గంటి శ్రీనివాసరావు నియమితులయ్యారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కమిటీ సమావేశం శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. బాబూరావు మట్లాడుతూ ఈ నెల 9వ తేదీన జరగనున్న జాతీయ సమ్మెలో స్కీం వర్కర్లు, బిల్డింగ్ వర్కర్లు, రైతు వ్యవసాయ కార్మికులు కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలన్నారు. సరళీకరణ విధనాలు అమల్లో భాగమే లేబర్ కోడ్‌లను కార్మికులపై రుద్దడమే అన్నారు. పెట్టుబడిదారులకు అత్యంత లాభాలు గడించడానికి ఇప్పుడున్న చట్టాలు ఆటంకంగా ఉన్నాయని తెలిపారు. లేబర్ కోడ్‌లను తెచ్చిందని రద్దు చేసేవారకు పోరాటాలను చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ సమ్మెను విజయవంతం చేయడంతో ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్నారు. జిల్లా నాయకులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆశాలు, మిడ్‌డే మీల్స్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, పెద్ద ఎత్తున బహిరంగ సభలో పాల్గొన్నాలని చెప్పారు.



అపరాల వర్కర్స్ ఆధ్వర్యంలో ప్రచార ర్యాలీ



మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ ఆధ్వర్యంలో ప్రచార ర్యాలీ

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ కార్యాలయం నుంచి పోలీస్ ఐలాండ్ వరకు కార్మికులు, నాయకులు ఆధ్వర్యంలో ప్రచార ర్యాలీ జరిగింది. తొలుత అప్పలస్వామి భవనంలో చిటికిన రాము అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జవ్వాది శ్రీను, చిటికిన రాము, అయినాల సత్యనారాయణ, అడపా లోవ, యడ్ల శ్రీను, దాసరి రాజు, తదితరులు మాట్లాడుతూ సమ్మెలో దేశ వ్యాప్తంగా 45 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు పాల్గొంటున్నారని తెలిపారు. దేశ సంపదను లూటీ చేస్తున్న మోదీ మిత్రులు అదానీ, అంబానీలకు ప్రయోజనాలు చేకూర్చడం ఎంతవరకు సమంజసమని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం



తణుకు కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి



కేసులు రాజీ చేస్తున్న అడిషనల్ జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

తణుకు అర్బన్: తణుకు కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 743 కేసులును న్యాయమూర్తులు పరిష్కరించారు. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ 25, క్రిమినల్ 115, బెంచ్ కోర్టు 591, ప్రీలిటిగేటిన్ 12 కేసులు రాజీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి డి.సత్యవతి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులకు సంబంధించి ఇరువర్గాలు రాజీ మార్గాన్ని ఎంచుకుని పరిష్కరించుకోవడం ద్వారా వారి సమయం, ధనం ఆదా చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిరాం పాతర్లంక, బెంచ్ మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్ , న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, చోడే గోపికృష్ణ, పోలీసు అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 870 కేసులు రాజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ లోక్ అదాలత్ పట్టణంలోని కోర్టు భవనాల సముదయం ఆవరణలో శనివారం నిర్వహించగా నాలుగు బెంచ్‌లు పరిధిలో 870 కేసులు రాజీ అయ్యాయి. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు మేరకు మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, పదకొండవ అడిషనల్ జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా అధ్యక్షత వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.లలితాదేవిలు కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్‌లో సివిల్ 19, క్రిమినల్ 177, మెయింటెన్స్ కేసులు 8, ప్రీలిటిగేషన్ కేసులు 30, బెంచ్‌కోర్టు కేసులు 636, మొత్తం 870 కేసులు రాజీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ ఆధ్వర్యంలో కక్షిదారులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. న్యాయవాదులు పాల్గొన్నారు.



కక్షిదారులకు భోజన ప్యాకెట్స్ అందజేస్తున్న జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

ఆర్టీసీ ఉద్యోగుల డీఏ బకాయిలు చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

తణుకు అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులు చేపట్టి ఐదు డీఏ బకాయిలు చెల్లించాలని 12వ పీఆర్సీ అమలుతో పాటు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం తణుకు ఆర్టీసీ డిపోవద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని అర్హతలు కలిగిన అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని లేదా సుప్రీం కోర్టు ఆదేశాలు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. వేతనాలు చెల్లింపులో కాంట్రాక్టర్ దోపిడీ అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎక్కడ పనిచేసే వారికి అక్కడే ఇఎస్ఐ అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ కమిటీ సభ్యుడు కె. శేఖర్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు అమలుకు అవసరమైన బస్సులు పెంచాలని ఖాళీగా వున్న ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులు నిర్వహణ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించాలని ప్రైవేట్ వ్యక్తులకు అవకాశం ఇవ్వరాదన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ తణుకు డిపో అధ్యక్షుడు రాకడ రాజు, కార్యదర్శి టివి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



తణుకులో బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న యోహాన్ తదితరులు

తణుకు అర్బన్: రోడ్డుప్రమాదంలో గాయపడ్డ బాధితురాలికి, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆర్థిక సాయం పంపిణీ చేశారు. స్థానిక 6వ వార్డుకు చెందిన ముప్పిడి ఆదిలక్ష్మి కుమార్తె అనూష ప్రమాదంలో గాయపడడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో కారుమూరి అక్కడి వైద్యులతో మాట్లాడి అత్యవసర వైద్యం అందచేశారు. రూ.5వేలు ఆర్థిక సాయాన్ని వైఎస్సార్ సీపీ నాయకులతో అందచేశారు. అదే వార్డులోని బాలం రంగయ్య కుమారుడు నాగేంద్ర ఇటీవల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో అతనికికూడా రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందచేశారు. శనివారం బాధితుల ఇళ్లకు వెళ్లిన పార్టీ నాయకులు కారుమంచి యోహాన్ బాధితులకు సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తానేటి ప్రసాద్, దులపల్లి విద్యాసాగర్, దిర్సిపో శివ, ఉండ్రాజవరపు రామ్‌చరణ్, మార్లపూడి సచిన్, విప్పర్తి కుమారస్వామి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు తోడ్పాటు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి

తాడేపల్లిగూడెం రూరల్: చిన్నారుల విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు తోడ్పాటును అందిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి అన్నారు. శనివారం మండలంలోని చినతాడేపల్లి అంగన్‌వాడీ సెంటర్ నెం.100లో ఎర్లీ చైల్డ్ కేర్, ఎడ్యుకేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్తేరు రాణి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఆటపాటలతో కూడిన విద్యను చిన్నారులకు అందించడం ద్వారా వారిలో పాఠశాలలకు వెళ్లాలన్న ఉత్సాహం పెరుగుతుందన్నారు. అనంతరం నవచేతన్, ఆదర్శిల ప్రాముఖ్యతను వివరించారు. ప్రథమ్ కోఆర్డినేటర్ వెంకట్, అంగన్‌వాడీ కార్యకర్త ఎల్. దుర్గ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయండి



ఆర్టీసీ డిపో గేటు వద్ద ఈయూచే ధర్నా

తాడేపల్లిగూడెం (టీఓసీ): పీఆర్సీ కమీషన్ (12వ)ను వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్టు డిపార్ట్‌మెంట్ (ఏపీ పీటీడీ) ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోసం ఆర్టీసీ డిపో గ్యారేజీ గేటు వద్ద ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ ఆలీ ఆధ్వర్యంలో రెండు రోజు ధర్నా జరిగింది. ఎండీ ఆలీ, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు ఓ.వి.రాజు మాట్లాడుతూ పీఆర్‌సీ కమీషన్ నియమించకపోతే ఐ.ఆర్ ప్రకటించాలన్నారు. పెరుగుతున్న ప్రయాణీకులకు అనుగుణంగా ఆర్టీసీలో కొత్త బస్సులు కొనుగోలు చేయాలని కోరారు. పాత బస్సులు తరుచుగా గమ్యస్థానాలకు చేరుకోకుండా ఆగిపోతున్నాయని, రిపేర్లు వస్తున్నాయని, అధికారులు గుర్తించాలన్నారు. మూడు వేలు కొత్త బస్సులు లేకపోతే ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత ప్రయాణం సాధ్యం కాదన్నారు. అర్హులైన ఉద్యోగులకు ప్రయోషన్లు ఇవ్వాలని, ఖాళీలను భర్తీ చేయాలని, విద్యుత్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ కె.శ్రీను, భాషా, బీఎస్ రాజు, శివ, కె.శ్రీనివాస్, సువర్ణరాజు, మురళీ, ఆర్ఎల్ కుమారి, సలేషా, ప్రకాష్, సభ్యులు పాల్గొన్నారు.

చలో విజయవాడ విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రతి జిల్లాకు ఒకటి ఏర్పాటు చేస్తుంటే కూటమీ ప్రభుత్వం వాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి నీర్వీర్యం చేస్తుందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జిల్లేళ్ళ రమేష్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు అరిగెల అభిషేక్ అన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వీరు మాట్లాడుతూ ఈనెల 7వతేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య పిలుపు మేరకు విజయవాడ ఎన్‌టీఆర్ వర్శిటీ వీసీకి వినతిపత్రం అందజేసేందుకు విద్యార్థి సంఘం తరలి రావాలని కోరారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహించిన నర్సింగ్ విద్యార్థినులు

తణుకు అర్బన్: క్షయవ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని క్షయ విభాగ డిస్ట్రిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆర్. విద్యానంద్ అన్నారు. టీబీ ఇంటెన్సిఫైడ్ క్యాంపెయినింగ్‌లో భాగంగా శనివారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో రోగులు, నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కలిగి ఉన్న వారిని గుర్తించి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అనంతరం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఎస్‌టిఎస్ ఆర్. చైతన్య, ఎల్‌టీ చిన బాబు, భవ్య టిబి కోఆర్డినేటర్ ఆర్.కృష్ణ, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీల పెంపుపై పునరాలోచించాలి



హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ వద్ద ఆందోళన

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు, విద్యుత్ చార్జీలు పెంపుపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలని లేని పక్షంలో వీధి పోరాటాలకు సైతం వెనుకాడబోమని సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు హెచ్చరించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని నిలిపివేయాలని, అదానీతో సోలార్ విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలని, ట్రూఅఫ్ చార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శనివారం సీపీఐ నాయకులు, కార్మికులు ఆందోళన నిర్వహించారు. మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ భారాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 4 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి కోట్లాది రూపాయిల భారం ప్రజలపై మోపారని నిప్పులు చెరిగారు. స్మార్ట్ మీటర్లుతో కరెంట్ యూనిట్లు రెండు లేక మూడురెట్లు అదనంగా నమోదు అవుతా యని వాటిని బిగిస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సబ్ స్టేషన్‌లో సిబ్బంది బి.హనుమంతు, ఎన్‌వీపీ సత్యనారాయణలకు డిమాండ్లతో కూడని వినతిపత్రాన్ని అందజేశారు. నాగరాజువర్మ, నాగలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, ఎస్.భావాని, కె.లక్ష్మి, కె.పోల మ్మ, జి.రాంబాబు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి

పెంటపాడు: పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడిని ప్రభుత్వం తగ్గించాలని కోరుతూ కార్యదర్శుల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. శ్రీనివాస్, డి.నాగదేవిలు కోరారు. ఈ సందర్భంగా తమ సమస్యలను విన్నవించుకొనేందుకు వారు జిల్లా పంచాయతీ అధికారి కె. రామనాథ్‌ను కలిసి వినతిపత్రం శనివారం అందజేశారు. ఏదో పని ఒత్తిడి వల్ల తమ కుటుంబానికి సమయం కేటాయించలేక పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు బి. సత్యనారాయణ ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం తణుకు
90102 23729
90100 68395
90100 51493
Office mail : tpgadvt@gmail.com